# రాద్ధాంతం

★ రాజా ★

స్నేఫ్టీ రేజర్ బ్లేడుగదా, అన్నివిధాలా క్షేమకరంగా ఉంటుందని ఆలోచించి, నా పెన్సిలు దాంతో చెక్కుతున్నాను. ఇంతలోనే ముంచుకొచ్చింది ఈ సంఘటన అంతే మరి, మనఘటనకి ఏంచేస్తాం?

ఆ బ్లేడుతో నావేలు అంగుళంలోతుకి కోసుకుపోయింది. రక్తంబాగా కారడం మొదలెట్టింది. ఇంతలోకే మా ఆవిడ రంగంలోకి ప్రవేశించింది. రక్తాన్ని చూసి ఆవిడ మూర్ఛపోలేదు కనీసం తొణకనన్నాలేదు. ద్రౌపది శ్రీకృష్ణులవారికి చేసిన ఉపచారంలాగ గబగబా కొంగుచింపి కట్టుకట్టనూ లేదు ఆమె నాట్యభంగిమ లోకనుబొమలెత్తి, పెదవికొరుక్కుని, భుజాలు విదిలించి, ఇలాంటివేమీ తనికి క్రొత్తకాదన్నట్టుగా 'ప్చ్' అనిచప్పరించింది. ఆవిడ మందగమనంతో లోపలికి వెళ్ళి యింత అయొడీనూ, లింటుగుడ్డలూ, బ్యాండేజి గుడ్డలూ, బిందెడు చన్నీళ్లూ అక్కడ పెట్టి నర్సుకి మల్లే దెబ్బ కడిగి, ఆకాస్త దెబ్బకీ మోపెడు కట్టు కట్టింది, చివరకి అడిగింది, "ఏంజరిగిందేమిటి?" అని

నేను కట్టుకట్టిన ఆవేలుకేసి చూసుకున్నాను. ఆదెబ్బని చూసుకుని నాకునేనే మనస్సులో సానుభూతి చెప్పుకున్నాను.

"మరేమీలేదు. వేలుకాస్త కోసుకుంది" అని జవాబు చెప్పాను చివరికి,

"నాకామాత్రం తెలియకపోలేదులెండి, నేనేదో చూడనట్టు చెబుతారు. క్షణంక్రితం నేనేకదా కట్టు కట్టినది? ఎలాగ కోసు కున్నారూ అని అడుగుతున్నాను" అని సాగదీసుకుంది.

"ఒకబ్లేడుతో కోసుకున్నాను."

"మళ్లీ అదేమాటా? ఎలాగా, ఎందుకు కోసుకున్నారు?"

"పెన్సిలు చెక్కుతూంటే తెగింది."

"సర్లెండి మీధోరణి నాకు కొత్తగాదు ఎన్నేళ్లొచ్చినా యింకా చంటిపిల్లల చేష్టలు మానలేదు" అని విసురుగా వంటయింట్లోకి నిష్క్రమించింది మాఆవిడ.

ఇంతలో ఎవరో తలుపుతట్టారు, పోష్టుమాన్! నాకొక రిజిష్టర్డు ఉత్తరంతెచ్చాడు, సంతకంపెట్టమన్నాడు.

"ఇలాచూడు. నాకీవాళ కాస్త దెబ్బతగిలింది. ఈవాళ్టికి నావేలి ముద్దర మాత్రం తీసుకో." అన్నాను

భయంగా నా వేలుకేసిచూసి సానుభూతి చూపించి, వేలుముద్ర తీసుకుని వెళ్లిపోయాడు పోష్టుమాన్

ఏమిటిది? ఈ చిన్నదెబ్బకి అంతా ఇంత ఇదిగా చూస్తున్నారేంచెప్మా! మునపటికాలపు వాళ్ల ఇలాంటి దెబ్బ తగిలితే ఒక్కసారి నోట్లోపెట్టుకుని చప్పరించి, దులిపేసుకు పోయేవారు, పెద్ద పెద్ద యుద్ధాల్లో చేతులూ, కాళ్లూ, తలలూ పోయినాసరే యింకాదెబ్బలాడేవారేమరి! మరి ఈచిన్న దెబ్బకి అందరూ ఇంతరాద్ధాంత మెందుకుచేస్తున్నారో — అని ఆలోచించాను - ఆలోచించాను, ఎంతకీ నాకుదీని అంతుతేలలేదు.

క్రమేపీ దీని సంగతే మర్చిపోయి, ఆఫీసుకెళ్లాను. ద్వారం దగ్గిరే బంట్రోతు మళ్లీ జ్ఞాపకం చేశాడు.

"బాబుగారూ, ఏమైందండీ వేలుకి?"

"ఏమీలేదురా. చిన్న దెబ్బ''

"మోటుగా తగిలిందాండీ"

"అబ్బెబ్బే, అసలు దెబ్బేకాదనుకో" కసిరాను

"ఎలాగ తగిలిందండీ?"

"ఏమీలేదురా, పెన్సిలు చెక్కుతూండగా బ్లేడుతో కోసుకుంది'' అని వాడిదగ్గిర్నించి తప్పించుకుని లోపలికివెళ్లాను

నేనెందుకనవసరంగా వీళ్ల చేత ప్రశ్నలేయించు కొంటున్నాను? ఒకటికి పదిప్రశ్నలెందుకు? అంతా కలిసి ఒక్కముక్కలో, "నేను పెన్సిలు చెక్కుతూచెక్కుతూ ఆసేఫ్టీరేజరు కారణంగా నావేలు కొద్దిగామాత్రమే కోసుకున్నాను.'' అనో, లేక పోతే యింకాకుదించేసి, "పెన్సిలు చెక్కుతూ కోసుకున్నాను." అనోచెప్పకూడదూ? యింకమనకి పదే పదే ప్రశ్నలుండవుగా?

ఈ విశ్చయానికొచ్చి, నేను ఆపీసుకుర్చీలో కూర్చుని డ్రాయరు సర్దుకోడం మొదలెట్టానో లేదో అప్పుడే మాశాస్త్రి ప్రవేశించాడు శాస్త్రి కూడా మాఆఫీసులోనే పనిచేస్తున్నాడు వాడు వచ్చి రావడంతోనే ప్రశ్నలుకురిపించాడు. "ఏమిట్రోయ్. ఏమైందేమిటి చేతికి?

"కోసుకున్నాను" అనేశాను యింతకుముందు వరకూ వర్లించుకున్న పారం అంతామర్చిపోయి.

"ఎలాగ కోసుకున్నావు? "

"రేజర్ బ్లేడుతోటి...."

నేనింకా చెప్పకముందే లంకించుకున్నాడు. "రేజర్ బ్లేడుతోటి వెయ్యేలాగ కోసుకుంటా వోయ్ ? యింకా నీ గడ్డం తెగకోసుకున్నావంటే నమ్ముతాను. అసలు సంగతి నాగగ్గర దాచకు. నాకామాత్రం ఊహనాశక్తి లేకపోలేదు ఆవలిస్తే పేగులు లెక్కపెట్టేరకం మనం. మీ ఆవిడకి వంకాయలూ, గట్రా తరిగి యిస్తూండడం నేనెరుగనిదాయేమిటి?" అని వెటకారంగా నవ్వాడు.

యింతవరకూ శాస్త్రి గుక్క తిప్పుకోకుండా మాట్లాడడం వల్ల నేనేమి చెప్పలేక పోయాను చివరికి అన్నాను "నావేలు బ్లేడుతో పెన్సిలు చెక్కుతూంటే తెగింది "

నామాటలు శాస్త్రి ససేమిరా నమ్మకుండా నవ్వుతూ తన బల్లదగ్గిరికి వెళ్ళిపోయాడు.

ఇదెక్కడి అపవాదురా భగవంతుడా అని నేను విస్తుపోయాను. మా ఆవిడకి తరిగి యివ్వడమే కాదు అథవా కూరల సంగతేనా గమనించడం అలవాటులేదు వేళపట్టుకేదో యింత తినడం మళ్ళా నాపనిలో మునిగిపోవడం యిదే నా అలవాటు.

మళ్ళా ఆలోచించాను. బ్లేడు అనడం చేత వీళ్ళకి ఈ అనుమానం వచ్చింది "ఈసారి ఇల్లాంటి సందర్భం తటస్థిస్తే చాకు పదును పడుతుంటే కోసుకుందని చెబుదాం. ఇంక మనకి ప్రశ్నలుండావు" అనుకున్నాను. నా మనస్సంతా యిప్పుడు "వేలుకోసుకున్నాను " అనే మాటమీదే కేంద్రీకరింపబడిఉంది ఈసారి పరధ్యాహ్నంగా కలం. చేతబుచ్చుకవి అక్కడ నా బల్లమీద ఏదో అట్ట ఉంటే దానిమీద ఏదోగొలికి యింకనావేలు కోసుకున్నట్టు ఎవరికీ తెలియదనుకున్నాను.

యింతట్లో తలుపు తోసుకుని టైపిస్టు అమ్మాయి ప్రవేశించింది కొన్నికాగితాలతోటి. నాబల్లని సమీపిస్తూండగానే, యింక కాలహరణం చేయకూడదని నాచెయ్యితీసి జేబులో పెట్టుకుని, ఆలోచిస్తున్నాను.

ఆ అమ్మాయి బల్లదగ్గిరగా వచ్చింది. నేను నాచెయ్యి భద్రంగా దాచుకున్నాను.

"ఇవిగో కాగితాలు తెచ్చాను" అంది.

" సరే, అయితే బల్లమీదవుంచు" అని ముక్తసరిగా జవాబు చెప్పాను.

ఆమె కదల్లేదు. ఆమెముఖంకేసి చూశాను ఏదో ఆశ్చర్యంగా చూస్తోంది ఏదో చెప్పబోయి,

తనచేతివేళ్ళుమూసుకోడం, తెరవడం. వేళ్ళన్నీ పరీక్షగాచూసుకోడం మొదలెట్టింది.

నాకిదంతా బోధపడలేదు. యేమిటి తనచేతి వేళ్ళలాగ చూసుకుని మురిసిపోతోందని ఆశ్చర్య పడ్డాను.

కాస్సేపటికి ఆమె భయంగా తత్తరపాటుతో అంది. "వేలుకోసుకున్నాను" అని

నాకొక్కసారిగా వొళ్లు మండిందంటే నమ్మండి ఇంతజాగ్రత్తగా నేను దాచుకున్న రహస్యం ఇట్టే తెలిసిపోయిందని నాకు బలే కోపం వచ్చింది.

చటాలున లేచినించుని "ఏమిటే అన్నావ్?" అని పిడికిళ్లు బిగించి అన్నాను

కాస్సేపు ఆమె భయపడి, నాబల్లమీద ఉన్న అట్టమీదవున్న అక్షరాలకేసి చూపించింది. అవి నేను పరధ్యాన్నంగా ఉన్నపుడు రాసిన అక్షరాలే. "వేలుకోసుకున్నాను" అని రాసి ఉంది.

ఇంతలో నాచేతివేళ్ళే బయట పడ్డంతో ఆమె అడిగింది "ఏమిటయిందేమిటండీ? మీవేలికి ?" అని.

"తెగింది" అన్నాను ముక్తసరిగా.

"ఆఁ! వేలంతా తెగిపోయిందా?" ఆ అమ్మాయి పడిపోబోయింది.

"అబ్బే చిన్నదెబ్బే."

"మీరుచాలా నీరసించి పోయినట్లు కనిపిస్తున్నారు. చాలారక్తం కారిపోయి ఉంటుంది."

"అబ్బెబ్బే అలాంటిదేమీ జరగలేదు"

"అయితే ఏవిధంగా కోసుకున్నారు ?"

"మరేమీలేదు. చాకుని బ్లేడుతో పదును పదుతూ"

"ఏమిటీ! చాకును బ్లేడుతోటా"

"కాదుకాదు పెన్సిల్‌ని బ్లేడుతో చెక్కుతూ"

"కాని.."

"కానీలేదు. పొరపాటున చెప్పానంతే జరిగినదంతే"

"మీమాటల ధోరణిచూస్తే మీరుచాలా బలహీనంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఈవాళటికి విశ్రాంతి తీసుకోండి" అని సలహా యిచ్చింది నర్సులాగ.

"చాల్లే యిక కట్టిపెట్టు మళ్ళీ మాట్లాడేవంటే ఇంక మాటదక్కదు" అని కసురుకున్నాను. భయంతో వణికిపోతూ లోపలికి పరిగెత్తింది.

యింక యిలాగ కాదనుకున్నాను గబగబా పరిగెత్తాను మూర్తి అక్కడ రాసుకుంటున్నాడు.

"ఏమయ్యా మూర్తీ! నీకీదెబ్బ ఎందుకు తగిలిందో కావాలా ?" అని ఆ కట్టుకట్టిన వేలు వాడికళ్ళమీద పెట్టాను.

"అక్కర్లేదు" అని ఆశ్చర్యంతో అన్నాడు.

చకచకా హెడ్‌క్లర్కు దగ్గిరకి పరిగెత్తాను. అతను మాట్లాడను పర్మిషనిచ్చేవరకూ అలాగే నిలబడి ఉంటాననుకున్నాడు. కాని నేను అతని దగ్గిరకి వెళ్ళి దెబ్బతగిలిన వేలు అతని ముక్కు క్రింద పెట్టి "చూడు ఈ దెబ్బబాగా వాసనచూడు. దీని వివరాలు నీకుకావాలా?" అన్నాను తెల్లబోయి వీడికేమన్నా పిచ్చిఎక్కిందా అన్న ధోరణితో చూశాడు నన్ను.

యింతలో వరండాలో ఒకమనిషిగోడకి జార్లగిలబడి నిలుచున్నాడు. వెంటనే వాడిదగ్గిరకి పరిగెత్తి "అయ్యా ఈవేలుయొక్క పురాతన చరిత్ర తమకు వినిపించేదా!" అని అడిగాను

"ఊహుఁ" అని విస్తుపోయాడా పెద్దమనిషి.

"వద్దా"

"ఉహుఁ"

నిరాశతో నిట్టూర్చి యింటికి పరిగెత్తాను. వేళకి ముందుగావచ్చిన నన్నుచూసి నాయిల్లాలు ఆశ్చర్యంగా "ఏమైందేమిటి? " అని అడిగింది.

పక్కమీద పడుకుని "నేనివాళ రోగిని. నన్ను మాట్లాడించకు." అని ముసుగు బిగించాను.